# ★ పరీక్షఫీజు ★

కె. వీరభద్రశాస్త్రి. బి. ఏ.

నారాయణరావు ఒక నిట్టూర్పు విడిచి, కొడుకు వ్రాసిన వుత్తరం మడిచి జేబులో పెట్టుకొన్నాడు. ఆవేళ ఏడో తారీఖు. పదిహేనో తేదీ లోగా అరవై రూపాయలు పరీక్ష ఫీజు కట్టకపోతే కొడుకు యీ సంవత్సరం పరీక్షకు వెళ్ళడంపడదు... ఇది బి. ఎస్. సి. ఆఖరు సంవత్సరం. ఈ ఏడాది చదువు పూర్తి అవుతే కొడుకు చేతికి డిగ్రీ వస్తుంది. ఆ తర్వాత ఎక్కడో నౌకరీ చూసుకొంటె తన చేతికి అక్కరకు వస్తాడు. అవును! ఇదంతా పరీక్షకు వెళ్ళినప్పుడు మాటగదా! అప్పుడే తోటి గుమాస్తాల దగ్గర నూట ఏభై రూపాయలు దాకా అప్పుచేసాడు, అది తీర్చలేదనే వాళ్లు నిష్ఠూరరంగా మాట్లాడారు.

గడియారం కేసి చూసి చిన్న తనపనిలో నిమగ్నుడైనాడు నారాయణరావు... కాని కాగితాలు పని కదలటంలేదు. ముఖ్యంగా నారాయణరావు చూస్తున్నది ఎస్టాబ్లిష్‌మెంటుసీటు. సరిగ్గా చదివి, జాగ్రత్తగా డిస్పోజ్ చేయక ఏమాత్రం అవక తవకగా వ్రాసినా, ఉద్యోగుల జీవితాలతో ఆడటం వంటిది. సాధారణంగా అతని దగ్గరనుంచి ఫైలువస్తే కళ్ళుమూసుకొని సంతకం పెట్టవచ్చు అనే ధీమా ఆఫీసర్కు వుంది నారాయణరావు ఆ ఫైళ్ళను అంత జాగ్రత్తగా చదివి. స్వయంగా, రూల్సు ప్రకారం డిస్పోజ్ చేస్తాడని ఆఫీసర్కు అనుభవం వల్ల తెల్సు. అందుచేత, నారాయణరావు వికలమైన మనస్సుతో పనిచేయలేక, ఫైళ్లను కట్టేసి, కుర్చీలో జేర్లబడి కూర్చున్నారు.

అతని మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు దొర్లుతున్నాయి. తన కొడుకు భవిష్యత్తు తను సంపాదించి పంపించబోయే అరవై రూపాయలమీద వుంది... వాడు ప్యాసవుతే తమ కంపెనీలో తప్పక వుద్యోగం యిస్తామని తన మామగారి స్నేహితుడు వాగ్దానంచేసాను. వాడు కూడా ఉద్యోగంలో చేరితే, ఆఫీసు దగ్గరలో అద్దె ఎక్కువయినా మంచి యిల్లు తీసికొని హాయిగా వుండవచ్చు. మైలున్నర రోజూ నడచి రానక్కరలేదు

◆ ◆ ◆

మధ్యాహ్నం వంటిగంటకు కాఫీహోటల్కు బయద్దేరిన నారాయణరావుకు వెంకన్న కనిపించి నమస్కారం చేసారు. వెంకన్న ఒక గ్యాంగు మేస్త్రీ. వాడికి స్వగ్రామంలో రెండు ఎకరాల పొలం వుంది. ఆ వూరుకు బదిలీ చేయించమని అర్జీ పెట్టుకొన్నాడు. ఇంతకు పూర్వం వెంకన్న అక్కడ పని చేసిన రోజుల్లో తన గ్యాంగు మనుష్యులచేత డ్యూటీ చేయించకుండా, తన పొలం పని చేయించేవాడని ఒక నేరంమోపబడి, అది రుజువయి, శిక్షగా అక్కడనుంచి బదలీ చేసారు మళ్ళి తన స్వంత వూరుకు బదలీ చేయించమని ఆఫీసర్లు ఎన్నిసార్లు అడిగినా లాభంలేకపోయింది. ఇప్పుడున్న ఆఫీసరువచ్చి ఏడాది అయింది. ఆయనకు యీ విషయాలు తెలియవు నారాయణరావు చెప్పితే తప్ప, ఆయనకు తెలిసే అవకాశంలేదు. అందుచేత నారాయణరావుని బ్రతిమాలి, తన పాతనేరం కప్పిపుచ్చి, తిరిగి తనకు తన వూరు బదిలీ చేయించమని అడగడానికి వచ్చారు వెంకన్న. నారాయణరావు అందుకు వప్పుకోలేదు చివరకు వెంకన్న "మీ కష్టం వుంచుకోనండి! 2 వ నెల జీతం...!" అంటూ నసిగాడు. హోటలులోకి వెళ్ళబోతున్న నారాయణరావు ఆగిపోయి వెంకన్న కేసి నిశితంగా చూసి 'ఛీఛీ! అవతలకి ఫో! అని లోపలికి వెళ్ళిపోయారు

◆ ◆ ◆

ఒక గంట పర్మిషన్ అడిగి నాల్గు గంటలకే యింటికి చేరారు నారాయణరావు! భార్య చేతికి కొడుకు వ్రాసిన వుత్తరం యిచ్చాడు. ఆమె ఆ వుత్తరం చదివి, ప్రశ్నార్థంగా అతని మొహంలోకి చూసింది. అతను కూడా భార్యకేసిచూస్తూ ఏం చేద్దాం!! ఆఫీసులో! అప్పు పుట్టదు. ఈ అరవై పంపించకపోతే వాడికీ యేడు పరీక్షకు వెళ్ళయోగం వుండదు!' అన్నాడు.

నారాయణరావు కాళ్ళు చేతులు మొహం కడుక్కొని, తిర్గి చొక్కా వేసుకోవడంచూచి అతని భార్య కాఫీ తెచ్చియిచ్చింది.

'అల్లా వెళ్తాను. ఒకాయన వీలు అవుతుందేమో చూస్తాను, నాల్గున్నరకు రమ్మన్నాడు...' అని కాఫీ త్రాగి చెప్పులు వేసుకొని వెళ్ళిపోయారు. అతనికేసి చూస్తూ అల్లాగే నిల్చుండి పోయింది ఆమె. నిజమే! యీ సంవత్సరం పూర్తి అయితే ఇంక వుద్యోగంలో జేర్తాను. వాడు సంపాదిస్తువుంటే, పెన్నిళ్ళకు చన్నీళ్ళ సాయంగా తండ్రికి అక్కరకొస్తాను. కూతురు ఎదిగి పెళ్ళికి సిద్ధంగా వుంటే వచ్చే జీతం తిండికి, కొడుకు చదువుకీ చాలకపోతే పెళ్ళిళ్లు ఎల్లా చేస్తారు? ఏమిటో యీ కరువు రోజులు! ధరలు మండిపోతూ వుంటే మధ్య తరగతి కుటుంబాలు ఎల్లా జీవిస్తాయో ??

కొడుకు పరీక్షకు జీతం ఎల్లాగా అనేదే ముఖ్య సమస్యగా ఏర్పడింది ఆమెకు.

◆ ◆ ◆

ఎక్కడా అప్పుపుట్టక కాళ్ళీడ్చుకొంటూ వస్తున్న నారాయణరావుకి భార్య ఎవరిమీదో కేకలు వేయడం వినిపించింది. ఏమైందా అని కంగారుగా వచ్చారు. గేటు దాటి లోపలికి వెళ్ళేసర్కి వెంకన్న కనిపించారు అరుగుమీద ఒక అరటిపళ్ళ గెల వుంది. నారాయణరావుకి చూడగానే 'ఇదిగో అయ్యగారు వచ్చారు. నేను చెప్పితే విన్నావా!

(తరువాయి 20 వ పేజి)

## ప రీ క్ష ఫీ జు

(10 వ పేజి తరువాయి)

ఇల్లాంటి లుచ్ఛాపనులు ఎన్నడు చెయ్యకు! ముందు అవితీసికొని వెళ్ళు!' అంది.

నారాయణరావుని చూడగానే వెంకన్న కొంచెం కంగారు పడ్డాడు. చేతిలోని వంద రూపాయల నోటు జేబులో పెట్టుకొన్నాడు. నారాయణరావుకి పరిస్థితి అర్థం అయింది అతనికి కోపంతో మొహం జేవురించింది.

'ఏం వెంకన్నా! ఇందాకా చెప్పానా? ఇల్లాంటి పనులు నేను చేయనని!! అందుకని దొడ్డిదారిని మొదలు పెట్టావా? నాకు అనవసరంగా కోపం తెప్పించకు నువ్వు అనుకొన్నంత అధముడిగా నేను దిగజారి పోలేదు. ఇంకెప్పుడైనా యీ మాదిరిగా చేశావంటే ఆఫీసరుగారికి నీ మీద రిపోర్టు యివ్వవలసి వస్తుంది. ఊఁ అది తీసికోపో!' అన్నాడు నారాయణరావు.

వెంకన్న అరటి పళ్ళ గెల తీసికొని ఏం మాట్లాడలేక వెళ్ళిపోయాడు.

'మీరు వెళ్ళిన అరగంటకు వచ్చాడు! అమ్మగారు' అని పిలుస్తే ఎవరా అని వచ్చాడు. నన్ను చూస్తూనే 'యీ గెల లోపల పెట్టించండి' అన్నారు. ఎవరు నువ్వు, యీ గెల ఎక్కడిది? అని అడిగాను. వాడు గ్యాంగు మేస్త్రీట! ఏదో బదలీకావాలని మీతో చెప్పుకొన్నారుట' ఈ లెఖ అయ్యగారికి యివ్వండమ్మా' అంటూ వందరూపాయల కాగితం తీసారు. దాంతో నాకు సంగతి అర్థం అయింది మేం అల్లా తిప్పుపుచ్చుకోం తీసికొని పో అంటే వినడే!! వాడి సొద వినలేక చచ్చాను! నాకు కాగితం చూస్తే భయం వేసింది.'

'వాడు వట్టి వెధవలే! తప్పు పనిచేసి పనిష్మెంటుమీదవచ్చాడు. వాడి మచ్చను కప్పి పుచ్చ త్గి వానికి బదలీ చేయించాలిట! రాస్కెల్!' నారాయణరావు కోపంతో కొంచెం వణికాడు.

'ఇంతకీ మీరు వెళ్ళిన పని ఏమైంది?'

'ఏం లాభంలేకపోయింది! ఆ పెద్దమనిషికి ఎవరో బాకీ తీర్చాలిట. వారు యిస్తారేమో యిద్దామని రమ్మన్నాను. వాడు బాకీ తీర్చలేదు, యీయన నాకు యివ్వనూ లేదు.' అంటూ కుర్చీలో కుర్చున్నారు నారాయణరావు అతని భార్య లోపలికి వెళ్ళింది. ఏమిటి చెయ్యటయా అని కుర్చీలో జార్లబడి కన్నుమూసుకుని కూర్చున్నాడు నారాయణరావు.

ఇంతలో అతని నుదురుమీద వల్లని చెయ్యి తగిలింది. నారాయణరావు కళ్ళు తెరిచాడు. ఎదురుగా భార్య అనునయంగా 'చూడండీ! దీన్ని తీసికొనిపోయి తాకట్టుపెట్టు, అమ్మో డబ్బుతీసికొనిరండి' అంటూ అతని చేతికి యిచ్చింది నారాయణరావు తెల్లబోతూ

'ఏమిటి! నీ మంగళ సూత్రమా!! నీకేమైనా మతిపోయిందా? చివరకు నీ మంగళ సూత్రం అమ్ముకోనా??'

'మరేం ఫర్వాలేదు. పసుపుకొమ్ము కట్టుకొని కాలక్షేపం చేస్తాను. దేముని దయవుంటే ముందు ముందు చెయించుకోలేకపోం!' అంది.

నారాయణరావు ఒక నిట్టూర్పు విడిచి మంగళసూత్రం జేబులో వేసుకొని బజారు వైపుకు బయల్దేరాను.

—

## మ న వి

కోర్టు ప్రకటనలు పంపువారు ఈ క్రింది విషయములు గమనించగోర్తాం.

అక్షరములు విడివిడిగా వ్రాయగోర్తాం

1 వ తేదీ పత్రికలో ప్రచురణ కాగోరు ప్రకటన 25 వ తేదీలోగాను, 15 వ తేదీ పత్రికలో ప్రచురణ కాగోరు ప్రకటన 10 వ తేదీలోగాను పంపగోర్తాం.

ఉత్తమ సాహిత్యానికి

శ్రీముఖ ప్రచురణలు

SRIMUKHA PUBLICATIONS MASULIPATAM

* మణిమంజీరాలు

* తుషారబిందువులు

* సుమసౌరభాలు

* వక్రించిన సరళరేఖలు

* దేవత

* గబ్బిలాయిలు

* కనువిప్పు

ఆకర్షణీయమైన అమ్మకపు షరతులు.

శ్రీ ము ఖ ప్ర చు ర ణ లు —

మ చి లీ ప ట్న ము - 1